“వేళ గాని భోజనం. ఆకలిగా లేదు కూడా” అన్నాడు బలరాం పీటమీద కూర్చుంటూ.

“ఫర్వాలేదు లెద్దురూ. ఈ ఒక్క పూటకే గదూ. ఆ టైమంతవరకే తినండి. వచ్చేసరికి పన్నెండు దాటుతుంది. అప్పుడెలా తింటాం” అంది అమల పళ్ళెంలో అన్నం పెడుతూ.

“ఏమిటే అన్నం యిలా ఎర్రగా వుంది?” అన్నాడు బలరాం అన్నం చేతిలోకి తీసుకొంటూ.

“మొన్న పరకేశయ్య బియ్యం బదులు తీసుకెళ్ళి యివ్వాళ దంపుడుబియ్యం తెచ్చిచ్చింది. వాళ్ళింట్లో దంపుడుబియ్యమే వాడతారట మొన్న సమయానికి లేవని మన బియ్యమే తీసికెళ్ళింది” అంది అమల కూర వడ్డిస్తూ.

“ఈ దంపుడు బియ్యం ఆరోగ్యమేగానీ అన్నం మేకుల్లా వుంటుంది.”

“సరేగాని మనకు టైం సరిపోతుందా? టిక్కెట్టు దొరకడం కష్టం. డైలీ సినిమాలకే రష్‌గా వుంటుంది. ఇలా ఏ టికెట్టో సారి సెపరేట్ ప్రోగ్రాం వుంటే థియేటరులో కొలువు పెట్టటం బ్రహ్మప్రళయం. వినా అంత చిన్న థియేటరులో నాట్యప్రదర్శనేమిటే?” అంది అమల తను అన్నం పెట్టుకుంటూ.

బలరాం వాచీ చూశాడు “ఏడుంబావు. భోంచేసి టాయిలెటయి అరగంటలో వెళ్ళిపోవొచ్చు. టికట్సు తీసివుంచమని కృష్ణకి చెప్పాను. వినా నువు తొందరగా తెములాలి”

“నా ఆలశ్యం ఏమీ వుండదు. ఐదు నిమిషాల్లో రెడీ, నాట్యాలంటే నాకెంతో యిష్టం. ఈ వూళ్ళో ఎప్పుడో ఓసారి ఏవరద బాధితులకో, క్షామనివారణకో, ప్రోగ్రాం వుంటుందిగానీ, మా వూళ్ళో అయితే కనీసం వారానికి రెండుసార్లయినా నాట్యప్రదర్శనాలుంటాయి. సినిమాలకంటే ఎక్కువిష్టం నాకు.”

“మరి నువ్వెందుకు నేర్చుకోలేదు?”

“అంతదృష్టం నా జాతకంలో లేదు. పోనీ చూసి ఆనందించటానికి అవకాశాలుంటే చాలు. ఇంతకీ మనం మాటల్లో బడి ఆలస్యం చేస్తున్నాం.”

“మరేం ఫర్వాలేదు. కావలసినంత టైముందిగానీ, ఏ చీర కట్టుకుంటావ్? వైటేనా?”

“అవును. నైట్‌డ్రెస్ వైటేగదా. సరిగా తెలుపు చీర, నలుపు చోళీ తీసిమంచంమీద పెట్టి వచ్చా. కోనా వేసారెటు రొట్టెన్నరతిన్నాడని, వేళ గాని వేళంటూ వేగిన్నెలు

ఖాళీచేశాం” నవ్వింది అమల చెయ్యి కడుక్కొని లేస్తూ.

“మరి మూడుగంటలసేపు కుర్చీలో కూర్చోటానికి ఓపికుండొద్దూ? అదిగాక నువ్వొండిన వంకాయ కూర.”

“బలరామం” “ఏవోయ్ బలరామం” వీధిలోంచి కేకలు వినపడాయ్.

“ఎవరో మీ ఫ్రెండుగారు. కలుసుకుని కూర్చోక తొందరగా తెములండి. ఇంతలో నేను రెడీగావుంటాను” అంది అమల వెళ్తున్న బలరాం నుద్దేశించి.

*   *   *

అమల బట్టలు కట్టుకొని అద్దంముందు నుంచుని బొట్టు రాసుకొంటూంటే బలరాం హడావిడిగా లోపలికొచ్చాడు. “ఆయన ఎవరో తెలుసా? నా ఫ్రెండు కాదు. నీచుట్టం మీ రెండో వదిన పెదతండ్రి రామనాథంగారు. ఏదో పనిమీద వచ్చారట. పొద్దుపోయిందని, ఈ రాత్రికుండి వెళ్ళిపోవచ్చని యిక్కడికి వచ్చారట. ఎలా మనం వెళ్ళేది? ఆయనకి భోజనం పెట్టొద్దూ?” అమల గుతుక్కుమంటి మొహం ముడుచుకుపోయింది.

“వేళాపాళా లేదు చుట్టాలు రావటానికి.” విసుక్కుంది.

“అందుకే అతిథి అన్నారు.”

‘బావుంది మీ వరస. గృహస్థులు మీరుండిపోయి ఆ అతిథిని రిసీవ్ చేసుకోండి.” విసవిసలాడింది అమల.

“నాకేం? ఆయన నీచుట్టమే. దానికేంగానీ, యింకో అరగంట టైముంది. ఒక్క అరసోలెడు బియ్యం పావుగంటలో వండలేవూ? కూరలున్నాయిగా. మహా అయితే టెన్ మినిట్స్ లేటవుతుంది. మానుకోనక్కరేదు. ఏమంటావ్?”

అమల మొహం కొంచెం విప్పారింది. “లేటైతే ఏం బావుంటుందండీ? మొదట్లో చక్కటి ప్రార్థనాగీతం ఎంత బావుంటుంది! వినే అదృష్టం లేదు” విచారించింది అమల.

“ముందు ఆయన్నోసారి పలకరించుదువుగాని రా. ఇలా విచారిస్తూ కూర్చుంటే——”

అమల గబగబా వీధిగదిలోకి నడిచింది. ఆ ముసలాయన కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు. కుర్చీపక్కన గోడుగూ సంచీవున్నాయి.

“అంతా బావున్నారా మావయ్యగారూ? మీరిదేనా రావటం?” అంటూ నవ్వు తెచ్చుకొని పలకరించింది. ఆయన అమలకేసి చూస్తూ “బాగా వున్నారమ్మాయ్. వచ్చిన పని అవక ఈ పూటకి వుండిపోవలసి వచ్చింది.” నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడాయన.

“దానికేమండీ? ఇదేం యిల్లుగాదా? మీ అమ్మాయియిల్లే అనుకోండి.” భర్తకేసి చూస్తూ “మీరు మావయ్యగారితో మాట్లాడుతూండండి. నే లోపలికెళ్తాను” అని వంటగదికేసి నడిచింది. “చీర మార్చుకొని వంట

ఒయ్యారము

చిత్రకారుడు: డి. పి. ప్రసాద్-గుంటూరు.

"చుట్టమై చూడొచ్చి"

చేస్తే? ఆఁ అరగంట భాగ్యానికి విప్పా, కట్టా కైంవేసు. అన్నమేకదూ ఎంతలో వుడుకుతుందీ?" అనుకొంటూ పొయ్యి రాజేసి ఎసరు పెట్టింది. "దక్కగా యీపాటికి వెళ్తూవుందును. జనం కిటకిటలాడుతూ వుంటారు. రతీమన్మథ నృత్యం ఎంతబావుంటుందీ! అది మొదలేకూడా. చూస్తానో లేదో, అదృష్టంకూడా వుండాలి. పాపం పొయ్యి గమ్మునే అంటుకొందిలే." అమల చెవుల్లో గజ్జెలు ఘుణఘుణ మ్రోగుతోంటే బుర్ర ఆలోచనల్తో నిండిపోతూంది.

* * *

"లేవండి మామయ్యా. కాళ్ళు కడుక్కొని భోంచేద్దురుగానీ." అంది అమల వీధి గదిలోకొచ్చి.

"అచ్చా. ఎందుకమ్మాయ్ నీకా శ్రమ? రేపుదయం భోంచెయ్యొచ్చు. ఈ పూటకి ఫర్వాలేదులే అమ్మాయ్" అన్నాడాయన.

"అలా అనకండి. ఇంటికొచ్చిన చుట్టానికి భోజనం పెట్టటానికి శ్రమేంటి బాబాయ్? అటువంటి శంక లేమీ పెట్టుకోకుండా భోంచెయ్యండి." అన్నాడు బలరాం.

"అదిగాదు నాయనా! మామూలుమనిషినైతే శ్రమేముందిలే. విధవగోడవ. క్రిందటేడాది చచ్చే జబ్బుచేసింది చూశావ్, అప్పట్నుంచీ పత్యంగా తింటున్నాను దంపుడుబియ్యం అన్నంగాని పనికిరాదు వంకాయ, అవకాయ, లాంటివి వాడటం లేదు. వాలాజీ తాలింపు కుదర్నే కుదరదు అందుకేగదూ, ఎప్పుడూ యిల్లు కదల్ను నేనిబ్బందిపడి యితర్ల నిబ్బంది పెట్టాలి. పూటేలు మెతుకులు వాసనచూస్తేనే జబ్బు తిరగబెడుతుంది. ఈ రాత్రిపూట మీరెం శ్రమపడతారు నాయనా నాగురించి?" అన్నాడాయన దిగులుగా. ఆయన మాటలు వింటూ బలరాం స్తంభించిపోయాడు. అమల గుండె ఆగిపోయింది. ముసలాణ్ణి నమిలి మింగేద్దామన్నంత కోపం వచ్చింది. పత్యాలూ, పానాలూ వున్నవాళ్ళు పొరుగిళ్లకెందుకు రావాలో? పానకంలో పుడకలాగ, చిరాకుగా లోపలికెళ్ళిపోయింది అమల. బలరాంకూడా నెమ్మదిగా లోపలికొచ్చాడు.

అమల మంచంమీద కూర్చునివుంది మూతి ముడుచుకొని.

"అన్నం వండావుకదూ? నిమ్మకాయ పచ్చడుంది. చారుంది. పెరుగుందికదూ...?" న్నాడు నెమ్మదిగా బలరాం.

అన్నన్నంమాత్రం ఏదీ? దంపుడన్నం

(40-వ పేజీ చూడండి)

వంటలు

పీలు గిన్నెలో గాని వేసి వుడకబెట్టి (ముద్దలాగ) చల్లారిన తరువాత రుబ్బాలి (మెత్తగా) మిరపకాయలు గుప్పెడు అట్టేవుంచి (తిరగమూతకు) మిగత కాయలన్నీ కొంచెము నూనె వేసి వేయించాలి, రెండు స్పూనుల మెంతులుకూడ వేయించాలి.

అప్పుడు మిరపకాయలు, మెంతులు మెత్తగా దంచగొట్టాలి. బెల్లము వుడుకు వప్పుడు వేయాలి, పసుపు వుప్పు కూడా వుడికేటప్పుడు వేసి అడుగంటకుండా కలియ బెడుతుండాలి. తరువాత మిగతనూనెలో, మిర్చి, సెనగపప్పు, మినపప్పు, ఆవాలు మెంతులు వేసి (నూరిన అల్లముకూడ రుబ్బేటప్పుడే వేసి) తిరగమూత చేసి, అల్లము కారము, మెంతిపిండి, పసుపు బెల్లము, వుప్పు కలిపివుంచిన దానిని తిరగమూతలో పోసి కాసేపు వుడకనిచ్చి దింపి చల్లారిన తరువాత జాడీలో పెట్టిన జాగ్రత్తగా వాడుకుంటే, సంవత్సరం వుంటుదంటారు కాని నాలుగునెలలు వుంటుందని నేను అనుకున్నాను.

పచ్చిమిర్చితో

ముదిరి దోరగావున్న పచ్చిమిరపకాయలు అరవీశెడు తొక్కు దానిలో పవాశేరుకి కొంచెము తక్కువగా చింతపండు గింజ వుట్టి ఏరినది వేసి, షుమారు మూడుగిద్దలు వుప్పుకూడ వేసి (అంటే పచ్చిమిర్చిలో కారము బాగావున్నవి లేనివి వుంటై కనుక షుమారు అన్నాను) పసుపు వేసి తొక్కి జాడీలో వుంచి మూడవనాడు, మెత్తగా పచ్చడికి వీలుగా వుండునట్లు రుబ్బి మెంతులు ఒకచెంచాడు వేయించి పిండిచేసికలిపి, ఒకసవాశేరు నువ్వుల నూనెను కాచి, దానిలో గుప్పెడు మిర్చి గుప్పెడు, సెనగపప్పు, గుప్పెడు మినపప్పు, ఆవాలు, కొంచెము ఇంగువపొడి, కొంచెము మెంతులు వేసి తిరగమూత వేస్తే ఇదికూడా చాలా రుచిగా వుంటుంది. తిరగమూత గింజలు ఎక్కువగానో తక్కువగానో తినే వారి ఇష్టాన్ని బట్టి వేసుకోవచ్చు. వీటిని బటి పెట్టి చూచుకుని తరువాత ఎక్కువ తక్కువ లెక్క ప్రకారము మార్చవచ్చును. ఫిబ్రవరి, మార్చి నెలలలో తీసినకంద, అరదు కనక చింతకాయవలె త్రొక్కిన కొలది పారదు వచ్చును. ★

ఎస్. కె. దుర్గ (కాటూరు.)

★ “చుట్టమై చూడొచ్చి...” ★

(36-వ పేజీ తరువాయి)

మెతుల్లా గట్టిగావుంటే ముసలాయన తినలేడేమోనని మరబియ్యమే వండాను.” అంది అమల.

బలరాంకి నవ్వొచ్చింది. అదిచూసి అమల కేడుపొచ్చింది.

“నాఖర్మ. లేకపోతే ఈపాటికి ధియేటర్లో కూర్చుని వుండవలసినదాన్ని...... చుట్టమై చూడొచ్చి దయ్యమై పట్టుకొందని ... నాకదృష్టం లేదు” అంది భారంగా అమల. బలరాం అమల పక్కన కూర్చున్నాడు “చూడమలా! ఆయనేం గతిలేక మనింటికి రాలేదు. అనవసరంగా మనకి శ్రమిస్తున్నానని ఎంతో నొచ్చుకొంటున్నాడు. ఇదే వాళ్ళమ్మాయయితే యిలా విసుక్కునేదా? మనం పెడితే తింటాడు. లేకపోతే పస్తుంటాడు. మర్యాద గల పెద్దమనిషింటికొస్తే ఎలా పస్తుపడుకోబెడతాం? డాన్సులు యివ్వాళ కాపోతే రేపుంటాయి. ఆ భాగ్యానికి మంచీ మర్యాదా లేకుండా ఎలా?”

“ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?”

“లేచి అన్నం వండు. నేనలా బజారు కెళ్ళి బీరకాయలైనా, ఏవైనా తీసుకొస్తాను. కాస్త నెయ్యి తాలింపేసి కూర వండొచ్చు. లేమరి. ఎనిమిది దాటిపోయింది.”

అమల మాట్లాడకుండా వంటగదిలోకెళ్ళింది. బలరాం కూరగాయలసంచి తీసుకొని వీధిలోకి నడిచాడు.

* * *

తెల్లవారింది. అమలకి రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు. పట్టినా ఏ రతీమన్మథులో, ఉమాశంకరులో, రాధాకృష్ణులో నాట్యం చేస్తూ లేపేసేవారు. లాభం లేదనుకొని కను చీకటుండగానే లేచిపోయింది. ముసలాయన మూడుగంటలకే లేచి కూర్చున్నాడు. అమల ఆయన కోసం నీళ్ళుకాచి స్నానానికి తోడింది. కాఫీ తాగడని తెలుసుకొని, అప్పుడే పాలమనిషి తెచ్చిన పాలు కాచి యిచ్చింది. “బలరాం లేవలేదమ్మా?”అన్నాడాయన పాలగ్లాసందుకొంటూ.

“లేదు మామయ్యా! లేపమంటారా?”

“అతనే లేస్తాడులే. పనేంలేదు. వెళ్ళిపోయే ముందు చెప్దామని.”

“ఇంత పొద్దుటే ఎక్కడికెళ్తారు? భోంచేసి వెళ్దురుగాని.”

ఆయన చిన్నగా నవ్వుతూ లాగు క్రింద పొట్టి జేబులోంచి కొన్ని నోట్లుతీసి అమల కందిస్తూ 'ఇవి వుంచుకోమ్మా” అన్నాడు. అమల ఆశ్చర్యపోయింది “నాకు డబ్బెందుకు మామయ్యా?” అంది—“ఇది డబ్బనుకోకమ్మా. సంతోషంగా యిస్తున్నాను. రాత్రి వచ్చినా కన్నతండ్రికి చేసినట్టు చేశావు. నీ ఋణం ఎలా మర్చిపోను? నా కూతురైతే యిచ్చుకోకుండా వెళ్తానా. తీసుకోమ్మా. నీకు నచ్చిన చీర కొనుక్కో. నేనే చీరకొని తెస్తే తీరా నీకు నచ్చకపోతే...అందుకని నువ్వే కొనుక్కో” అంటూ ఆయన నోటు అమల చేతిలో పెట్టాడు. అమల తలవంచుకొని తదేకంగా ఆలోచిస్తోంది. బలరాం ఆవలిస్తూ బయటకొచ్చాడు. “వెళ్తున్నానోయ్ బలరాం. ఒకతనితో మాట్లాడి మెయిల్ కెళ్ళిపోతా. వీలుచూసుకొని మాయింటికోసారి రండి. వస్తానమ్మా అమలా” అంటూ ఆయన సంచీ గొడుగూ పట్టుకొని వీధిలోంచి నడిచాడు. బలరాం మత్తు వదిలించుకొని “అదేంటి బాబాయ్. అప్పుడే వెళ్తున్నారు? నేనూ వొస్తా ఆగండి” అంటూ వెంబడించాడు.

“వద్దు నాయనా. ఇప్పుడెళ్ళకపోతే అతను దొరకడు. ఫర్వాలేదులే. వెళ్తా” అంటూ ఆయన చరచరా వెళ్ళిపోయాడు. బలరాం లోపలికొచ్చాడు. అమల అలాగే నుంచుని వుంది, చేతిలో ఐదుపదులు రెపరెపలాడుతున్నాయ్. అంతటి సహృదయుణ్ణి ఈసడించుకొన్నందుకు నొచ్చుకొంటూ “చుట్టమై చూడొచ్చి...” అనుకొంటూంటే కళ్ళలో నీళ్ళుతిరిగాయి. ★



అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశీయు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్రసేఫ్ కంపెని,

షోరూము: సరస్వతీటాకీస్ రోడ్, విజయవాడ-1.

వర్కుషాపు: మునిసిపల్ ఆఫీసురోడ్, విజయవాడ-1.